క్లుప్తంగా

మంత్రి వాహనం తనిఖీ



భిక్కనూరు: మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వాహనాన్ని భిక్కనూరు టోల్ ప్లాజా సమీపంలో ఉన్న చెక్‌పోస్టు వద్ద పోలీసులు, ఎన్నికల అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. ఎన్నికల ప్రచార నిమత్తం హైదరాబాద్ నుంచి కామారెడ్డికి వెళ్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వాహనాన్ని పోలీసులు చెక్‌పోస్టు వద్ద నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీ మొత్తాన్ని వీడియో తీశారు.

ప్రవీణ్‌కుమార్‌కు గ్లోబల్ టీచర్ అవార్డు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ ఆదివారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఏకేఎస్ ఫౌండేషన్ గ్లోబల్ టీచర్ అవార్డు అందుకున్నారు. దేశ వ్యాప్తంగా 60 మంది ఉపాధ్యాయులకు ఏకేఎస్ ఫౌండేషన్ గ్లోబల్ టీచర్ అవార్డులు అందజేసింది. లింగాపూర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌కు జాతీయ అవార్డు దక్కడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బాల్య మిత్రుడి కూతురు వివాహానికి ఆర్థిక సహాయం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజివాడిలో ఆదివారం ఆజాద్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యుడైన మంగళి రాజుకు రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. బాల్య మిత్రుడు రాజు పేదరికంలో ఉన్నాడని తెలుసుకుని, ఆయన కూతురు వివాహం కోసం ఆర్థిక సహాయాన్ని అందించాలనుకున్నారు. 2020లో రూ.2లక్షల 50వేలను బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ డబ్బులు ప్రస్తుతం రూ.3 లక్షలయ్యాయి. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆదివారం ఆటవిడుపు



కామారెడ్డి క్రైం: బాల్యం అంటేనే సరదా. ఆటల సమయం. ఆదివారం వచ్చిందంటే చిన్నారులకు పండగే. పాఠశాలకు సెలవు కావడంతో అందరు చిన్నారులు తోటి వారితో సరదాగా ఆడుకునేందుకు ఉన్న అన్ని మార్గాలను వెతుకుతుంటారు. వేదిక ఏదైనా ఆడుకోవడమే ప్రధానం. అలా చిన్నారులు కామారెడ్డి మండలం గూడెం గ్రామంలోని వరి ధాన్యం కుప్పల్లో సరదాగా ఆడుకుంటున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

బీఎస్పీ ఎన్నికల హామీ కరపత్రాల ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్: బీఎస్పీ ప్రజలకు ఇచ్చిన ఎన్నిక ల హామీల కరపత్రాలను ఆదివారం కామారెడ్డి జి ల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. కామారెడ్డి బీఎస్పీ అభ్యర్థి ఉడుతవార్ సు రేష్‌గౌడ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ ముద్రించిన కరపత్రాన్ని పార్టీ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బి.బాలరాజు, అభ్యర్థి ఉడుతవార్ సురేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భీమరి భాస్కర్ ముదిరాజ్, జిల్లా కోశాధికారి హరిలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో పలువురి చేరిక



కామారెడ్డి అర్బన్: బహుజన్ సమాజ్ పార్టీలో కామారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి ఉడుతవార్ సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో రాజంపేట మండలానికి చెందిన వివిధ పార్టీల నేతలు ఆదివారం చేరినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు బి.బాల్‌రాజు తెలిపారు. బీఎస్పీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

- కామారెడ్డిలో రేవంత్ రెడ్డి పోటీ చేయనుండటంతో హర్షాతిరేకాలు
- టపాసులు కాల్చిన కార్యకర్తలు, నేతలు

కామారెడ్డి అసెంబ్లీ నుంచి సీఎం కేసీఆర్‌పై పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి పోటీ చేస్తున్నారనే ప్రచారం మొదలవడంతో నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సంబురాలు చేసుకుంటున్నారు. బాణ సంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేస్తే సీఎం కేసీఆర్‌కు డిపాజిట్ గల్లంతు చేస్తామని అన్నారు. – సాక్షి నెట్‌వర్క్



భిక్కనూరులో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



ఘన్‌పూర్‌లో బాణసంచా కాలుస్తూ..



రాజంపేటలో ..



దోమకొండలో..

ఎల్లారెడ్డిలో ఎగిరేది బీజేపీ జెండాయే



సుభాష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న కాంగ్రెస్ నేతలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో ఎగరబోయేది బీజేపీ జెండాయేనని బీజేపీ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎల్లారెడ్డి పట్టణంలోని గాంధీనగర్, నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాలోని బొల్లారం, మోతె, ఎక్కపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సుభాష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వీరికి సుభాష్‌రెడ్డి పార్టీ కండువాలను కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ధనంజయ్ తదితరులున్నారు.

అధికారంలోకి రాగానే రూ.5 లక్షల బీమా

- ఎల్లారెడ్డి అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన బీజేపీ నేతలు

ఎల్లారెడ్డి: బీఆర్ఎస్ ప్రభుత్వం కొలువు తీరగానే తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా రూ.5 లక్షల బీమా అందిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఆదివారం వెల్లుట్లపేట, ఎల్లారెడ్డి పట్టణంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జలంధర్‌రెడ్డి, సతీష్ తదితరులున్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడుదాం



వెంకటరమణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న రత్నగిరిపల్లి గ్రామస్తులు

- కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి: బీఆర్ఎస్ అరాచక పాలనకు చరమగీతం పాడాలని కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని రత్నగిరిపల్లి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ రమేష్, మాజీ ఉపసర్పంచ్ కృష్ణారెడ్డితో పాటు 109 మంది ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఓటేస్తే బిచ్చమెత్తుకోవాల్సి వస్తదన్నారు. నీళ్లు, నిధులు,

నియామకాల పేరుతో ఏర్పడిన తెలంగాణలో ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాన్నాల వెంకట్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తేలు శ్రీనివాస్, నాయకులు పరశురాములు, పండ్ల ప్రవీణ్, దేవేందర్, వెంకటేష్, దేవయ్య ఉన్నారు.

ఉచిత హామీలు నమ్మొద్దు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తెలంగాణలో బీఆర్ఎస్ అవినీతి పాలనను అంతమొందించే వరకు నిద్రపోయేది లేదని బీజేపీ నాయకులు వ్యాఖ్యానించారు. ఆదివారం కుబ్యానాయక్ తండాలో ఇంటింటికి తిరుగుతూ, , సీతారాం తండాలలో శివారులో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉచిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను నమ్మి మోసపోకుండా, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి జుక్కల్ నియోజకవర్గ ఆడబిడ్డ, బీజేపీ అభ్యర్థి అరుణతారను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సంజయ్ పటేల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సుభాష్, బీజేపీ మండల అధ్యక్షులు బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



కుబ్యానాయక్ తండాలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎంపీపీని కలిసిన చుక్కాపూర్ గ్రామస్తులు



నర్సింగరావుతో చుక్కాపూర్ గ్రామస్తులు

మాచారెడ్డి: చుక్కాపూర్ గ్రామస్తులు ఆదివారం ఎంపీపీ లోయపల్లి నర్సింగరావును కలిశారు. జెడ్పీటీసీ రాంరెడ్డిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి తమపై ఒత్తిడి తేవడం వల్ల ఆందోళనలో పాల్గొన్నట్లు తెలిపారు. చుక్కాపూర్ గ్రామానికి వచ్చి ఎన్నికల ప్రచారం చేయాలని ఎంపీపీని వారు కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ నర్సింగరావు మాట్లాడుతూ.. చుక్కాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్‌తోనే గిరిజన తండాల అభివృద్ధి



బాన్సువాడ రూరల్(బాన్సువాడ): బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గిరిజన తండాలు అభివృద్ధి చెందాయని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోర్లం క్యాంపు తండాలో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చింది.. ఎంతో మంది గిరిజనులు ప్రజా ప్రతినిధులుగా ఉన్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో గిరిజనులు అభివృద్ధిలో వెనకబడ్డారు.. నేడు ప్రతి తండాకు బీటీ రోడ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటింటికి తాగునీరు, భూమి పట్టాలు ఇచ్చామన్నారు. నేతలు మోహన్ నాయక్, పీర్య నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

దివ్యాంగ ఉపాధ్యాయ, ఉద్యోగ సంక్షేమ సంఘ కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా దివ్యాంగ ఉపాధ్యాయ, ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా జే.రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా బాణాల నరేష్‌రెడ్డి, కోశాధికారిగా చిందం సాయిలు, ఉపాధ్యక్షులుగా డి.శ్రీశైలం, బి.భూమయ్య, ఎండీ అజ్జు, సంయుక్త కార్యదర్శులుగా కే.శంకర్, యెంబరి లింగం, ముఖ్య సలహాదారులుగా కే.పూర్ణచందర్, కే.పోచాగౌడ్, డి.కృష్ణమూర్తిశర్మ, న్యాయ సలహాదారులుగా జంగం శ్రీశైలం తదితరులు ఎన్నికయ్యారు.

'బండ ప్రకాష్ మాటలు నమ్మొద్దు'



దోమకొండ: శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాటలను ముదిరాజ్ కులస్తులు నమ్మొద్దని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి అన్నారు. దోమకొండ పెద్దమ్మ ఆలయంలో సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన ఆదివారం మాట్లాడారు. చట్టసభల స్థానాలను వదిలేసి చిన్నాచితక పదవులకు ఆశపడి బీఆర్ఎస్ అడుగులకు మడుగులు తొక్కుతున్నారన్నారు. రాష్ట్రంలో 119 స్థానాల్లో ఒక్క స్థానంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు అవకాశం ఇవ్వలేదన్నారు. దీనికి నైతిక బాధ్యత వహించి శాసన మండలికి బండ ప్రకాష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు పుట్ట రమేష్, మాజీ అధ్యక్షుడు నాగారపు రాములు, యువసేన రాష్ట్ర కార్యదర్శి సార్ల రాజు, నాయకులు ఆశబోయిన శ్రీనివాస్, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో?



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి నుంచి కస్తూర్బా పాఠశాల వరకు ప్రస్తుతం మట్టి రోడ్డు ఉంది. నాలుగు సంవత్సరాల క్రితం వేసిన ఈ రోడ్డు చిన్న చిన్న గుంతలతో కొంచెం ఎగుడు దిగుడుగా మారింది. మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై వెళ్లే ద్విచక్రవాహనాలు సైతం తరచుగా జారిపడి ప్రయాణికులు గాయాలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఈ రోడ్డును బీటీ రోడ్డు మార్చి విద్యార్థులతో పాటు ప్రయాణికుల కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



బీఆర్ఎస్‌లో చేరుతున్న తిమ్మనగర్ గ్రామస్తులు

- ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులు దొరకడం లేదు
- జుక్కల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పిట్లం(జుక్కల్): కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని, ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులు దొరకడం లేదని, అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని జుక్కల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. ఆయన ఆదివారం తిమ్మనగర్, మార్థండ, ఖంబాపూర్, కారేగాం, గొద్మేగాం, ధర్మారం, చిన్నకొడప్గల్, బుర్నపూర్, అల్లాపూర్, పారేడ్‌పల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామాలలోని వీధులలో ర్యాలీగా వెళ్లి గ్రామస్తులను కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సింధే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని..ఆ పథకాల గురించి వివరించారు. తాను లోకల్ అని, జుక్కల్ నియోజకవర్గంలోనే తాను పుట్టి పెరిగినా.. చదువుకున్నా.. ఇక్కడే ఉద్యోగం చేసిన.. ప్రజలకు సేవ చేయాలని ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి రాజకీయల్లోకి వచ్చానని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధి పనులను చాలా చేసుకున్నాం. ఇంకా కొన్ని మిగిలి ఉన్నాయి.. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే మిగతావి పూర్తి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఎమ్మెల్సీ ఎల్‌వీ రమణ



కామారెడ్డిలో మాట్లాడుతున్న ఎల్‌వీ రమణ

కామారెడ్డి క్రైం: కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత పద్మశాలీలపై ఉందని ఎమ్మెల్సీ ఎల్వీ రమణ అన్నారు. కామారెడ్డిలోని పార్శిరాములు కళ్యాణ మండపంలో ఆదివారం నియోజకవర్గంలోని ఏడు మండలాల పద్మశాలీలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పద్మశాలీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం ఉన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముందుండి పరిష్కరించేందుకు బాధ్యత తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు ప్రకాష్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టేలా చూడాలి



మాట్లాడుతున్న తిర్మల్‌రెడ్డి

భిక్కనూరు: కార్యకర్తలు ప్రతి ఓటరును కలిసి తొమ్మిదిన్నర ఏళ్ల నుంచి జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించి తిరిగి మరోసారి కేసీఆర్‌కు పట్టం కట్టాలని కోరాలని ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన భిక్కనూరు మండలం భాగిర్తిపల్లిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త వచ్చే 25 రోజులు పార్టీ కోసం శ్రమించి పోలైన ఓట్లలో 80 శాతం ఓట్లు కేసీఆర్‌కు పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, సిద్ధరామేశ్వరాలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నేతలు శ్రీశైలం, సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం



రాజంపేటలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



దోమకొండలో.. ఎంపీపీ శారద, మహిళలు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం బీఆర్ఎస్ నేతలు ప్రచార జోరును పెంచారు. ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని, ప్రభుత్వం మారితే ఆగిపోయే ప్రమాదం ఉందని ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దని సూచించారు. మూడో సారి అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పెద్దమల్లారెడ్డిలో..



అయిలాపూర్‌లో ..



మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండాలో..



సదాశివనగర్‌లో..

డబ్బులకు లొంగి ఓటును అమ్ముకోవద్దు



అవగాహన కల్పిస్తున్న జాగో తెలంగాణ సభ్యులు

ఎల్లారెడ్డి: ఓటర్లు మద్యానికి, డబ్బులకు ఆశ పడి ఓటును అమ్ముకోవద్దని తెలంగాణ రాష్ట్ర డెమోక్రసీ ఫెడరేషన్(టీఎస్‌డీఎఫ్), జాగో తెలంగాణ కన్వీనర్లు వినాయక్ రెడ్డి, ఆకునూరి మురళి సూచించారు. ఆదివారం ఎల్లారెడ్డిలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు బస్సుయాత్ర నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. అవినీతి, దోపిడీలకు పాల్పడుతున్న వారిని, నీళ్లు, నిధులు, నియామకాలు ఇవ్వని వారిని ఓడించాలని అన్నారు. హన్మేష్, గోవర్ధన్, రామకృష్ణ, రాములు తదితరులున్నారు.